# ఇక్కడ మేమంతా క్షేమం

- మధురాంతకం రాజారాం



అయ్యా, సినబాబూ! దండాలు సామీ, దండాలు. నా పేరు ఈరయ్య. మవు నన్ను మరిసినావేమో, మీ నాయనకు నేనంటే పేణం. మవ్వింతోడివిగా వుండేటప్పుడు నేను మీ యింటికాడ గొడ్లు మేపతావుంటి. అప్పుడు మీ అవ్వ వుండే. సచ్చి సొర్గాన వుంది వుణ్యాత్మురాలు. కడుపుజూచి అన్నం బెట్టేది ముప్పై మంది మనుషులు కలువుదీస్తావుంటే, పెడబావకు సంగటి గెలికి కుక్కి తట్టలో తలకెత్తుకోని మడికాడి కొచ్చేది. వందుకొచ్చిందంటే ముద్ద తినేవాడు రెండు ముద్దలు తినాల. ఆయమమ అస్తవాసి అటుమంటిది.

ఉగాదొచ్చినా నోములొచ్చినా, పెద్దపండగొచ్చినా ముందుగా కొడుకును బిల్చి 'ఒరే కోదండం! నీ ఖరుచులు నీకు నూరుండె. ఈరయ్యకు పంచలు తెచ్చియ్యడం మాత్తరం మరిచిపోబాక' అనేది.

మనిషి మంచీ చెడ్డా నచ్చేటప్పుడు శూడాలంటారు. బంగారు తల్లి మాటాడతా, మాటాడతా కన్నుమూసింది. మీ నాయన మాత్తరం? ఆయనా ఆ తల్లికి దగిన కొడుకే! మాటిస్తే తప్పడు, మనసిస్తే యిడవడు. బుద్ధిలో దరమరాజు. కిర్రుసెప్పులేసుకోని, గొడుగు సేత బట్టుకోని, పట్టెనామాలు పెట్టుకోని ఈధిలో నడిచొస్తా వుంటే– ఏలినోడు ఎంకట పెరుమాళ్ళే కొండ దిగొచ్చినట్టుండేది. సేతికెముక లేకపోయ, పెండ్లిండ్లకు ఖరుచులాయ. చేసిన అప్పులు తీరకపోయ. ఇంతలో ఆ అయ్యకట్టే కడతేరిపోయ. ఆయన పొయ్యేనాటికి నువు లేదర బిడ్డవైపోతివి.

నేనూ మీ ఇంట్లో కొలువు మానుకుంటి. 'ఎంత కాలమని ఒంటికట్టెగా వుండి పోతావురా? గంతకుదగిన బొంతగా జూచి ఒకింటోడివి కారా', అని మావాళ్ళందరూ సతపోరిరి. వాళ్ల మాట ఇనకపోయినా బాగుండె. ఇంటి. ఒకాడదాన్ని కట్టుకుంటి. నాకు ముగ్గురుబిడ్డలు గలిగిరి. నలుసంత బిడ్డలు యింతై అంతై యిప్పుడు నీ అంతటోళ్ళయినారంటే, అందుగ్గాను నేనెన్ని పాట్లు బడి నానో ఆ బగుమంతుడికే ఎరిక. కొండెక్కి బోదగోస్తి. అడివికి బోయి కట్టెలు గొడ్తి. సంతకు బండిదోల్తి. సెట్టెక్కి కాయలు రాలిస్తి. బాయిలో మట్టి మోస్తి. ఇల్లుగట్టే సోట యిటికలందిస్తి. సేతినిండుకూ పనుంటే ఎంత పనైనా సెయ్యొచ్చు. పన్లేకపోతే ఏం జెయ్యాల?

వానలు కురిస్తే ఏట్లో నీళ్ళొస్తాయి. ఏట్లో నీళ్ళొస్తే సెరువులు నిండుతాయి. సెరువులు నిండితే బాయిలో నీళ్లుంటాయి. బాయిల్లో నీళ్లుంటే పంట యిరుగారు పండుతుంది. అప్పుడు పనికేం కొదవ? మళ్లు దున్నాల, అండచెక్కాల, నారునాటాల కలుపుదియ్యాల, పంట గొయ్యాల, వాదెకొట్టాల, గింజలు బండ్లకెత్తాల, కసువువాము లెయ్యాల.

మనిషికి పని దొరకాలంటే సేద్యాలు జరగాల, సేద్యాలు జరగాలంటే నీళ్ళుండాల. సెట్టు సేమలు సిగురెత్తాలంటే కొండకోనలు పచ్చగిల్లాలంటే, కాపరాలు సల్లగా వుండాలంటే, దేశం నిమ్మళంగా వుండాలంటే, వాగుల్లో, వంకల్లో, బాయిల్లో, సెరువల్లో, సలి సెలమల్లో, ఊట గాలవల్లో నీళ్లుండాల, మనిషికయితే పూటకు రెండుసార్లయినా సెంబెడు సెంబెడు నీళ్లుండాల. గొడ్డుకయితే రోజుకు రెండుసార్లయినా కడివెడు కడివెడు నీళ్లుండాల, ఆ లెక్కన భూమి తల్లికెన్ని నీళ్లుండాల? వానసినుకు కిందరాలకనేపోతే ఆ తల్లి బతుకేం గావాల? ఆ తల్లిని నమ్ముకున్న మనసుల గతేం కావాల?

అదే గదంటయ్యా ఇప్పుడు జరగతా వుండేది! ఈ కరువు రాచ్చసే గదంటయ్యా మనకు మొదటి సెత్రువు! దీని వుటమారా, నాలుగైదేండ్లకోసారి ఎవురో బొటూకాటికి బెట్టి పిలవ్చినట్టు 'ఇదిగో నేనుండాను' అంటూ వచ్చేస్తాది గదయ్యా! ఒకేసారి సూసిపోతానంటాది. ఇంకొకొసారి ఒకటి రెండేళ్ళయినా టికానా బెట్టకపోతే తన వల్ల కాదంటాది. నాయన్నాయనా! ఇది మనకేం కొత్తగాదే! ఎప్పుడూ వుండే కతే!

మా అయ్య సెప్పేవోడు, అప్పుడెప్పుడో ఓబికాలంలో దాతు కరువొచ్చిందంట. వరసగా కొన్నేండ్లు వానలే లేవంట. అప్పట్లో జనం గుంపులుగుంపులుగా తెల్లారుజామున్నే బయలుదేరి జాం పొద్దెక్కేటప్పటికి కోటమరాజు కోనలో దిగబడిపోయి, చిక్కాల నిండుకూ దేవదారాకు కోసి తెచ్చేవాళ్లంట. సన్నగా తరిగి, వుడకబెట్టి నాలుగు వుప్పురాళ్ళేసుకొని ఆకలైనప్పుడంతా బొక్కెడు బొక్కెడు ఆకు తినేవాళ్ళంట. మరికొందరయితే కలమందగడ్డల్తో, యీత గడ్డల్తో పొట్టబోసుకున్నారంట.

అంతెందుకు? అప్పటికింకా నీ బుద్ధి నీకు రాలేదేమో, నలభైయేండ్ల నాడు గెంజి కరువొచ్చింది. గవర్నెంటోళ్ళు ఎర్రజొన్నలిప్పించి వూరూరికీ గెంజికేంద్రాలు పెట్టించిరి. గాడిపొయ్యిల మీద గెంజి కాగతావుంటే సుట్టుప్రక్కల వూళ్ళనించీ బీదా బిక్కీ, ఆడా మగా, పిల్లా జెల్లా ముంతలు బొచ్చెలు, సత్తుగిన్నెలు చేతబట్టుకోని సింతమాన్ల కింద మూగిపొయ్యేవాళ్ళు.

ముందుగా దేవిన చిక్కటి అంబిలి మారాజుల యిండ్లకు సేరిపోతే తమ వొంతు తమకొచ్చేటప్పటికి బీదజనానికి పల్చటి గెంజినీళ్ళు దక్కేవి. వడదెబ్బకి తట్టుకోలేక కొందరు ముసలీ ముతకా శోష తగిలి సింత సెట్ల కిందనే పడిపొయ్యేవాళ్ళు. ఆ అలగోడు, బాలగోడూ తల్చుకొంటే వాకిప్పటికీ ఒళ్ళు మానైపోతుంది.

అదంతా యివ్వడెందుకు? అసలు యినయం గాలికొదిలి, నేను పాత సంగతులన్నీ తవ్వుకుంటూ వుండా, ఏం లేదులే సామి. మవు నా పెద్దకొడుక్కొక జాబురాసి పెట్టాల. అందుకని పావలా బిళ్ళ పెట్టి పోస్టు ఆఫీసులో ఈ కాకితం కొనుక్కొచ్చినాము. ఏం రాయాల్సిందీ వేస్పైస్తాన్లే- నువ్వు మొదలుపెట్టు. 'ఒరే పెద్దబ్బా! నువ్వు నీ పెళ్లాం బిడ్డల్తో ఇల్లొదిలి వెళ్ళిపోయి ఆరునెల్లాయ. ఇంతకాలంగా అతీ గతీ తెల్పకుండా పోతివి. నువ్వు కాల్దీసి బయటపెట్టే నాటికి నీ పెళ్ళాం కడుపుతో వుంది. ఆ పిల్ల తీర్థమాడిందో లేదో తెలియకపోయ. మగబిడ్డో, ఆడబిడ్డో తెలియకపోయ, ఇక్కడ మేమిద్దరం ముసిలోళ్ళం గుడిసెలో అగోరిస్తా వుండామని నీకు బొత్తిగా గుర్తుండకపోయ, నీకంటే నాలుగాకులెగజదివినోడే నీ తమ్ముడు గూడా; మిల్టిరిలో సేరతానని వెళ్ళినోడు వాడు మిలిటరీలో సేరినాడో, లేకుంటే బెంగుళూర్లో మూటలే మోస్తా వుండాడో తెలియకపోయ.

మీ అక్కా, బావా రంగంపేటలో గవక వుండుంటే నెలకొకసారయినా వచ్చి మమ్మల్ని సూచిపోతా వుందురు. కూలీలు దొరక్క, జరుగుబాటు కుదరక వాళ్ళు కూడా బిడ్డల్ని చంకనేసుకుని వుత్తరాది వెళ్ళిపోయిరి. మాకామాతరం దిక్కుకూడా లేకపోయ. ఇక్కడ పరిస్థితి జూడబోతే వానాటికీ దిగజారిపోతా వుంది. తెల్లారిందంటే బయం. ఎండముకం జూడకుండా యింట్లో కూసుంటేనే బతికినాము. మద్యాణ్ణమయ్యేటప్పటికి కాకులు కూడా బయటకు కనబడవు.

ఒక్క బోరింగు బాయిలో దప్పితే యింకెక్కడా నీళ్ళు లేవు. వరిమళ్ళ ఆశ ఎప్పుడో వదులుకొన్ని. తడిసాలక సెరుకుదోటలు గూడా వాడిపోయ, గరిక పోసయినా నోటికి దొరక్క గొడ్లు గోదలన్నీ ఎముకల గూళ్ళయిపోయ. రైతులు దిగులుతో చిక్కి సగమైపోయిరి. మన అరిజనవాడలో నాలుగైదు కుటుంబాలు దప్పితే మిగిలినోళ్ళందరూ పొట్ట సేతబట్టుకుని దేశాలపాలై పోయిరి. మవు పోతా పోతా మిగిలించిన నాలుగు మేకల్లో ఆఖరి మేకను నెలరోజుల నాడు అమ్ముకుంటి. ఒళ్ళు జబ్బు చేసి మీ అమ్మ మంచం దిగి ఇరవై రోజులాయె. ఆసుపత్తిరి నించీ మాత్తర్లు తెచ్చిచ్చినా గుణం కనిపించలా. బియ్యం మాకతో జావ కాచి తాగిస్తా వుండా. 'బిడ్డల్ని సూడాల, బిడ్డల్ని సూడాల' అంటూ రెయ్యీ పగులూ ఒకటే ఆరాటం. మనూళ్ళో కరణంగోరి బామరిది లేదూ, ఎంకట నర్సయ్య, ఆయన బస్సులో వస్తావుంటే నువు కనిపించినావంట. ఆయన సెప్పంగా నువ్వెక్కడుండావో తెలిసింది. ఒరే నాయనా, మీరేమో రెక్కలొచ్చిన పచ్చులైపోతిరి. తలా ఒక మూలకు ఎగిరిపోతిరి. మాకేం మీ పెట్టుపోతలక్కర్లేదు. ఒకసారొచ్చి నువ్వు మీ అమ్మను జూచిపోతే సాలు. అదే పదేలు. బతికినంత కాలం బతకదు. ఈ జాబును తంతిగా ఎంచి, యిదందగానే బయల్దేరి రావాల. ఇంతే సంగతులు!

అంతేలే సామీ! ఇంకడ్రస్సు రాయి. 'పీలేరు టేషనుకు దచ్చనంగా మూడో మైల్లో బాట పనిజేసే చెంగల్రాయుడు' అనాయి. ఆమాత్తరం సాల్దంటావా? అయితే కుడికాలు కొంచెం ఎగరేస్తా నడస్తాడని గూడా రాయి, రాసినావు గదా! సాల్లే, సేరుతుందిలే. సేరకెక్కడ బోతుంది! దండాలు సామీ, ఎల్లొస్తా.

A Mega Complex

paraVastu ENCLAVE

EVEN THE Heavens APPLAUD



FIRST TIME IN VIZAG, IN AN ACRE LAND NEAR TAJ RESIDENCY OPP. BEACH, A HIGHLY ELEVATED COMPLEX OVERLOOKING THE VAST EXPANSE OF BAY OF BENGAL LENDING A TRANQUILITY TO ITS AMBIENCE

| Economical & Elegant | | Spacious & Splendid | | Unique Deluxe Flats |
|---|---|---|---|---|
| Doctors, Advocates, Auditors, Consultants, Business Executives — CHAMBERS | & | Branch or Corporate — OFFICE SPACE | & | Spacious 2 & 3 Bed Room with great Sea View |

LOANS WITH LESS INTEREST BY ALL FINANCIAL INSTITUTIONS

Please Come 'N' Contact :

Developers & Builders

Subhodaya ENGINEERS

VEANU ARCHITECTS PLANNERS & ENGINEERS

D.No. 48-8-20, Dwarakanagar, Visakhapatnam - 530 016. Ph : 531446, 550823 (O) 571742 574433 (R) Pager No. : 9622 554436 Cel : 98491-11446